క్లుప్తంగా

ఆర్మీ బలగాల కవాతు



కోహెడలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కోహెడ(హుస్నాబాద్): రానున్న ఎన్నికల దృష్ట్యా మండల కేంద్రంలో గురువారం ఆర్మీ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. కవాతులో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీఐ కిరణ్, కోహెడ, హుస్నాబాద్ ఎస్ఐలు తిరుపతి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాజీ జెడ్పీటీసీ దశదిన కర్మ



తూం అంజిరెడ్డి (ఫైల్)

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం ముద్దాపూర్ గ్రామ టీఆర్ఎస్ నాయకుడు తూం అంజిరెడ్డి దశదిన కర్మ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు తూం శ్రీకాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. కుకునూరుపల్లి గ్రామ సర్పంచ్‌గా రెండు పర్యాయాలు, మండల జెడ్పీటీసీ, ఎంపీపీ వైస్ చైర్మన్, పీఏసీఎస్ డైరెక్టర్‌గా ఒక్కో పర్యాయంతో పాటు 35 ఏళ్లు ప్రజాసేవ చేస్తూ ప్రజాబాంధవుడుగా పేరు తెచ్చుకున్నారన్నారు. మూడు నెలల కిందట అంజిరెడ్డి భార్య ఉమ మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. కాగా నూతనంగా ఏర్పడిన ముద్దాపూర్ గ్రామ పంచాయతీకి మొదటి సర్పంచ్‌గా అంజిరెడ్డి భార్య ఉమ గెలుపొందడంతో వైకుంఠధామం నిర్మాణానికి సొంత స్థలాన్ని విరాళంగా అందజేశారు.

ఈటలకు ఘన స్వాగతం



గజమాలతో స్వాగతం పలుకుతున్న బీజేపీ శ్రేణులు

ములుగు(గజ్వేల్): జిల్లా సరిహద్దు గ్రామమైన ములుగు మండలం వంటిమామిడి వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు పార్టీ శ్రేణులు గజమాలతో గురువారం ఘన స్వాగతం పలికారు. వంటిమామిడి నుంచి భారీ కాన్వాయ్‌తో గజ్వేల్‌లో నిర్వహించిన విజయ శంఖారావం సభకు వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మణ్‌గౌడ్, సురేష్‌గౌడ్, పల్లె రమేష్, పెంటయ్య, భాస్కర్‌రెడ్డి, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

సిద్దిపేట కమాన్: సమాజ సేవచేస్తున్న మహిళపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు పోస్ట్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు సీపీ కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌కు చెందిన సామాజిక సేవకురాలు సుల్తానా ఉమర్ తన ఫేస్‌బుక్‌లోని ఆమె ఫొటోను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. దీన్ని నిరసిస్తూ ఈనెల 28వ తేదీన దుబ్బాకలో ముస్లిం మైనార్టీ, దళిత బహుజన, విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా శతకోటి హరేరామ నామ యజ్ఞం

మర్కూక్(గజ్వేల్): మండలంలోని వర్ధరాజ్‌పూర్ గ్రామంలో శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో గురువారం పూర్వాభద్ర నక్షత్రం పురస్కరించుకుని శ్రీ పాండురంగ ఆశ్రమం ఆధ్వర్యంలో శతకోటి హరేరామ నామ యజ్ఞం, అఖండ హరేరామ భజన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు హరేరామ నామ జపం చేశారు. అనంతరం మాజీ సర్పంచ్ నరేష్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ, సర్పంచ్ ప్రవీణ్, ఆర్యవైశ్య సంఘం బాధ్యుడు శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నంగునూరు(సిద్దిపేట): నడుచుకుంటూ వస్తున్న దంపతులను ట్రాలీ ఆటో ఢీ కొనడంతో వారు గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి చెందాడు. గురువారం రాజగోపాల్‌పేట ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్మేట గ్రామానికి చెందిన గట్టు బాలచంద్రం(60), లక్ష్మి దంపతులు నడుచుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో మగ్దుంపూర్‌కు చెందిన పిల్లి రమేశ్ ట్రాలీ ఆటోతో వీరిని ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి గాయాలు కావడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బాలచంద్రం మృతి చెందాడు. కోడలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అసంపూర్తి పనులు.. ఆపై మెరుగులు

- బిల్లుల కోసం కార్యాలయాలకు పరుగులు
- ఇదే అదనుగా సర్పంచ్‌లకు అధికారుల వ్యక్తిగత పనులు
- చేయకుంటే బిల్లుల్లో కోతపెడతారని భయం
- ఫర్నిచర్ తరలించాలని అధికారి ఆదేశం

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనులకు బిల్లులు తీసుకోవాలంటే అధికారులు రికార్డులు చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లేదని తిరస్కరిస్తూ ఇంజనీరింగ్ అధికారులు తమకు కావల్సిన వ్యక్తిగత పనులను సర్పంచ్‌లతో చేయిస్తున్నారని గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. పనుల రికార్డు చేసే సమయంలో బిల్లులో కోతపెడతారనే భయంతో వారు ఇంజనీరింగ్ అధికారులు అడిగింది ఇవ్వడం హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో అనవాయితీగా కొనసాగుతోంది. అధికారులు చెప్పిన పనులు చేసేందుకు ఇష్టంలేకపోయిన చేసిన పనులకు బిల్లులు రావాలనే ఆశతో పనులు చేస్తున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం చివరి దశకు రావడం, ఎలక్షన్ కోడ్ అమలు కావడం, అసంపూర్తి పనులకు పైపై మెరుగులు దిద్ది రికార్డుల కోసం అధికారుల దగ్గరకు వెళ్తున్నారు. ఇదే అదనుగా భావించిన ఏఈ హుస్నాబాద్‌లోని డీఈ కార్యాలయంలోని ఫర్నిచర్‌ను ఐఓసీ భవనంలోకి తరలించే బాధ్యతలను అప్పగించింది. పందిల్ల, గాంధీనగర్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్లలో ఫర్నిచర్‌ను ఐఓసీ భవనానికి తరలిస్తున్నారు. ఫర్నిచర్ తరలిపునకు రవాణా చార్జీలకు బిల్లులు పెట్టుకొని కార్యాలయ ఖర్చుల నుంచి తీసుకొనే అవకాశం ఉన్నప్పటికీ సర్పంచ్‌లతో పనులు చేయించి బిల్లులు మాత్ర అధికారులు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. అధికారి చెప్పిన పనులు చేయకపోతే పనుల రికార్డుల్లో ఎక్కడ కోత పెడతారోనని భయంతో వ్యక్తిగత పనులు మానుకొని వారు చెప్పిన పనులు చేస్తున్నారు.



గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో ఆఫీసు ఫర్నిచర్‌ను తరలిస్తున్న హమాలీలు

గ్రామ పంచాయతీలకు కిరాయి చెల్లిస్తాం

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని పీఆర్ డీఈ కార్యాలయాన్ని ఐఓసీకి తరలించాలని డీఈ ఆదేశించడంతో గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను వాడుకున్నాం. ఫర్నిచర్ తరలించడానికి ప్రైవేటు వాహనాలు దొరకలేదు. అందుబాటులోని సర్పంచ్‌లకు ఫోన్‌చేసి ట్రాక్టర్లను ఉపయోగించాము. కావాలంటే పంచాయతీ కార్యదర్శులకు ట్రాక్టర్ కిరాయి చెల్లిస్తాం.

– స్నేహ, ఏఈ, పీఆర్, హుస్నాబాద్

కాంగ్రెస్‌వి బోగస్ గ్యారంటీలు

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: అమలు కానీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెడుతోందని, కాంగ్రెస్‌వి బోగస్ గ్యారంటీలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజని విమర్శించారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. తెలంగాణలో 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తుంటే, అక్కడ 5 గంటల కంటే ఎక్కువ కరెంట్ ఇవ్వలేమని ఆ రాష్ట్ర సీఎం సిద్దరామయ్య ప్రకటించారన్నారు. భారీ ప్రాజెక్టులు నిర్మించినప్పుడు కొన్ని తప్పులు జరగడం సహజమన్నారు. హుస్నాబాద్ అభివృద్ధి జరగలేదని చెబుతున్న పొన్నం ప్రభాకర్ తాను ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతానికి నయాపైసా తీసుకురాలేదని ఆరోపించారు. ఒక్క హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి తాము రూ.345 కోట్లు వెచ్చించామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి, నేషనల్ లేబర్ కోఆపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ వెంకట్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్యారంటీ స్కీంలతో లబ్ధి

బెజ్జంకి(సిద్దిపేట): పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణను గెలిపించాలని కవ్వంపెల్లి యువసేన వ్యవస్థాపకుడు కత్తి రమేశ్ ప్రజలను కోరారు. గురువారం బెజ్జంకి కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ స్కీంలతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితి లేదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దశమంతరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): అమలుకు సాధ్యం కాని హామీలతో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని, ఈ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలోలేరని జనగామ జిల్లా బీజేపీ అధ్యక్షుడు, జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తాజ్ గార్డెన్‌లో ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. దీనిపై ప్రశ్నించిన బీజేపీ నాయకులపై దాడులు చేస్తూ కేసులు పెట్టారన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు.

స్థానికేతరుడు ఎమ్మెల్సీ పల్లా నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, ఏ ముఖం పెట్టుకొని నియోజకవర్గంలో తిరుగుతున్నాడని ప్రశ్నించారు. చేర్యాల అస్థిత్వం కోల్పోవడానికి ప్రధాన కారకుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్‌గౌడ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, భిక్షపతి నాయక్, నాయకుడు రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ బైండోవర్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కపూర్ నాయక్‌తండా సర్పంచ్ భానోతు సంతోష్‌నాయక్‌ను గురువారం తహసీల్దార్ సంజీవ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలు పరిరక్షణలో భాగంగా ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు. బైండోవర్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని, బైండవర్‌లతో ప్రజాపోరాటాలను ఆపలేరని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా సహాయకార్యదర్శి శ్రావణి, గిరిజన హక్కుల పరిరక్షణ సంఘ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెండు గ్రామాల్లో..

తొగుట(దుబ్బాక): మండల కేంద్రమైన తొగుట, పెద్దమాసాన్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురిని తహసీల్దార్ శ్రీకాంత్ ఎదుట గురువారం బైండోవర్ చేసినట్టు ఎస్ఐ లింగం తెలిపారు. రెండు గ్రామాలకు చెందిన ఐదుగురిని బైండోవర్ చేశామన్నారు. అలాగే మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లిలో కిరాణా దుకాణంపై దాడిచేసి మూడు లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. శాంతి భద్రతలకు ఆటంకం కల్పిస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసిన ఎస్ఐ

కొండపాక(గజ్వేల్): పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరు పీఎస్ పరిధిలోని కొడకండ్ల గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి పురానం కిషన్, మ్యాకల వెంకటేష్, కంసాని రమేష్, గడ్డం ప్రశాంత్, ప్రవీణ్, హరికృష్ణను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.54,835 నగదు, రెండు మోటార్ సైకిళ్లు, రెండు కార్లు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు.

యువకుడి మృతి



కల్యాణ్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రమాదవశాత్తు నీటి మడుగు బురదలో తల కూరుకుపోయి యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో జరిగింది. గురువారం కుటుంబ సభ్యులు, మిరుదొడ్డి పోలీసులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాస కల్యాణ్ (25) తండ్రి మరణం తర్వాత తల్లితోపాటు పొలం పనులు చేస్తున్నాడు. బుధవారం వ్యవసాయ పొలం వద్ద మక్కజొన్నలు తీయడానికి కూలీలతో కలిసి వెళ్లాడు. సాయంత్రం పనిపూర్తి కాగానే స్నానం చేయడానికి బోరు పంపు వద్దకు వెళ్లాడు. స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న పొలం నీటి బురదలో పడిపోయాడు. తల బురదలో కూరుకుపోవడంతో ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందాడు. రాత్రయినా కల్యాణ్ ఇంటికి తిరిగి రాకపోవడంతో కంగారు పడ్డ కుటుంబ సభ్యులు బంధుమిత్రులను, తెలిసినవారిని విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. పొలం వద్ద గాలించగా నీటి బురదలో కల్యాణ్ కూరుకుపోయి కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి అన్న నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిర్ణీత సమయంలో రుణం చెల్లించాలి

ఆర్బీఐ లీడ్ జిల్లా అధికారి తాన్యసంగ్మా

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చుంచనకోటలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం డీసీసీ బ్యాంకు అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ డీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ఆర్బీఐ లీడ్ జిల్లా అధికారి తాన్యసంగ్మా మాట్లాడుతూ రద్దు చేసిన రూ.2 వేల నోట్లను మార్చుకోనివారు ఎవరైనా ఉంటే ఆర్బీఐ హైదరాబాద్ కార్యాలయంలో మార్చుకోవాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్ మాట్లాడుతూ తీసుకున్న రుణం నిర్ణీత సమయంలో తిరిగి చెల్లిస్తే భవిష్యత్‌లో ఎక్కువ మొత్తం రుణం పొందే అవకాశం ఉంటుందన్నారు. పిల్లలకు ఏటీఎం కార్డు ఇస్తే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఉన్నత చదువులు, ఆర్థిక అవసరాల నిమిత్తం రుణం తీసుకోవాలంటే ఆర్బీఐ అనుమతి పొందిన బ్యాంకు నుంచి మాత్రమే తీసుకోవాలన్నారు. ఇతర యాప్‌ల ద్వారా రుణం తీసుకొని నష్టపోవద్దని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చేర్యాల డీసీసీబీ మేనేజర్ నందిని మాట్లాడుతూ బ్యాంక్ కేవలం రుణమే కాకుండా పలురకాల సేవలు అందిస్తుందని, బ్యాంకు అందించే సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్య లేక జీవిత బీమా పాలసీ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు నోడల్ మేనేజర్, బ్యాంకు సిబ్బంది, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ దయాకర్, చేర్యాల సీఎఫ్ఎల్ కోఆర్డినేటర్ పోతుగంటి కరుణాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



జగదేవ్‌పూర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆరునూరైనా మూడోసారి సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని, ప్రతిపక్షాల కలలు పగటి కలలుగా మిగిలిపోతాయని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం జగదేవ్‌పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలే మూడోసారి బీఆర్ఎస్ విజయానికి శ్రీరామరక్ష అని అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేశారని, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలతో పంటలు ఎండి రైతులు అప్పులబాధకు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారి బాధలు తీర్చిన సీఎం కేసీఆర్‌కు రైతులు రుణపడి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ బాలేషంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, కొండపోచమ్మ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నరేశ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కవిత, నాచారం డైరెక్టర్ నాగరాజు, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఐలయ్య, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం



అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అల్పాహార పథకాన్ని డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డితో కలసి గురువారం ప్రారంభించారు. పాఠశాలలోని 220 మంది విద్యార్థులకు అల్పాహారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార పథకాన్ని గురువారం మండలంలో ప్రారంభించామని ఎంఈఓ దేశిరెడ్డి అన్నారు. బ్రేక్ ఫాస్ట్ పథకంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రతీరోజు ప్రభుత్వం సూచించిన మెనూ అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని పట్టణంలోని పెద్దమ్మ గడ్డ బాలుర పాఠశాల, ఉన్నత పాఠశాలల్లో గురువారం ఎంఈఓ మొగుళ్ల నర్సింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు న్యాయం

దుబ్బాకటౌన్: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి భూంపల్లి-అక్బర్‌పేట మండలం పోతారెడ్డిపేట గ్రామంలో 109వ రోజు ఆత్మగౌరవ యాత్ర చేపట్టారు. యాత్రకు మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. దుబ్బాక టికెట్ తనకే వస్తుందని మీ ఆశీర్వాదం కావాలన్నారు.

మోసంచేసే వారికి బుద్ధిచెప్పాలి

తొగుట(దుబ్బాక): ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పి మోసంచేసే వారికి ప్రజలు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి కోరారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ప్రభాకర్‌వర్మ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, వైస్‌చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎల్లారెడ్డి, గ్రామ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర



సికింద్లాపూర్‌లో అమ్మవారి శోభాయాత్ర

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని సిర్సనగండ్ల గ్రామంలో ఎస్సీ మాల సంఘం యూత్ ఆధ్వర్యంలో విజయదుర్గా మాతా నిమజ్జనోత్సవ శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. ఈనెల 15వ తేదీన ఎస్సీ కాలనీలో ఏర్పాటుచేసిన మండపంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి విగ్రహానికి పూజలు నిర్వహించారు.గురువారం శోభాయాత్ర నిర్వహించి చెరువులో నిమజ్జనం చేశారు. శోభాయాత్రలో యూత్ సభ్యులు నృత్యాలు చేస్తూ కేరింతలు కొట్టారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్, సికింద్లాపూర్, రామునిపట్ల గ్రామాల్లో గురువారం దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. కోలాటాలు, నృత్యాలతో యువకులు యాత్రలో సందడి చేశారు. అనంతరం చెరువుల్లో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటలో అమ్మవారి నిమజ్జనోత్సవంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని యూత్ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బత్తుల స్వామి, బాలకృష్ణ, కనకయ్య, కోఆప్షన్ సభ్యురాలు పెంటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో చైతన్యయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర జరిగింది. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన దాతలకు చైతన్య పరివార్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

దాడి చేసిన వారిపై కేసు

కొండపాక(గజ్వేల్): ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతిపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మర్పడ్గ గ్రామానికి చెందిన బోడపట్ల మహేష్ అదే గ్రామానికి చెందిన పిండి నారాయణ కూతురు ప్రవల్లిక ఏడాది కాలంగా ప్రేమించుకొన్నారు. పెళ్లి చేసుకోవాలకున్నారు. అయితే ప్రవల్లిక తల్లిదండ్రులు ఆ పెళ్లికి అడ్డుచెప్పడంతో ఈనెల 10వ తేదీన ఇర్కోడ్ శివారులోని మహంకాళి దేవాలయంలో పెళ్లి చేసుకొని వెంటనే త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో త్రీటౌన్ సీఐ ఇరు కుటుంబాలను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ చేసి పంపించాడు. కాగా ప్రవల్లిక తల్లిదండ్రులతో ప్రమాదం ఉందని మహేష్, ప్రవల్లిక దంపతులు హైదరాబాద్‌లో ఉంటున్న మహేష్ అక్కవద్ద ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 25న మర్పడ్గకు వచ్చి మహేష్ భార్యతో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉన్నాడు. విషయం తెలుసుకున్న ప్రవల్లిక తల్లిదండ్రులు, చిన్నాన్న కొడుకులు బుధవారం రాత్రి మహేష్ ఇంటికి వచ్చి ప్రవల్లికను బలవంతంగా తీసుకెళ్తుండగా అడ్డు వెళ్లిన మహేష్‌ను చంపుతామంటూ బెదిరించారు. గురువారం సాయంత్రం వరకు ప్రవల్లిక తల్లిదండ్రుల ఇంటికి తాళం వేసి ఉందన్నారు. మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ తెలిపారు.

వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌లోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి సృజన్ కుమార్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ స్లీవరాజ్ గురువారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి 67వ వాలీబాల్ పోటీలు (అండర్17) మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు అభినందించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్: రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన సత్యనారాయణ గౌడ్(40) పాత ఇనుప సామాన్ల వ్యాపారం చేస్తున్నాడు. గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువులో ఇటీవల దుర్గామాత, వినాయక నిమజ్జనాలు జరిగాయి. విగ్రహాల తయారీలో వాడే ఇనుప వస్తువులను సేకరించేందుకు చెరువులోదిగి మునిగిపోయాడు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.